క్లుప్తంగా

కవితా గోష్ఠికి బాలార్జున



బాలార్జున సత్యనారాయణ

అమలాపురం టౌన్: హైదరాబాద్‌లోని కర్ణాటక సాహిత్య మందిరంలో ఈ నెల 5న సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళా వేదిక, కన్నడ సాహిత్య మందిర్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలుగు కన్నడ కవితా గోష్ఠిలో పాల్గొనాలని అమలాపురానికి చెందిన కవి బాలార్జున సత్యనారాయణ మాకేకు ఆహ్వానం అందింది. ఈ మేరకు శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ద్వారా బాలార్జున ఎంపిక, ఆహ్వాన పత్రం అందుకున్నారు. తెలుగు, కన్నడ భాషాభివృద్ధికి ఏర్పాటు చేసిన ఈ ద్విభాషా కవితా గోష్ఠిలో ఉభయ తెలుగు రాష్ట్రాలు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పలువురు కవులు పాల్గొనున్నారని కవి బాలార్జున తెలిపారు. శ్రీశ్రీ కళా వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు తదితర సాహితీవేత్తలు, కవులు బాలార్జునను అభినందించారు.

సేవలతోనే చిరస్థాయి గుర్తింపు



అర్జునుడు దంపతులను సత్కరిస్తున్న డీఈఈ శ్రీనివాసరావు తదితరులు

అమలాపురం రూరల్: ఉద్యోగ బాధ్యతల్లో అందించిన సేవలే ప్రజల్లో చిరస్థాయిగా గుర్తింపు తెస్తాయని డీఈఈ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రంగాపురం ఇరిగేషన్ గెస్ట్ హౌస్ వద్ద ఇరిగేషన్ శాఖలో ఐసీ అసిస్టెంట్‌గా పనిచేసిన పి.అర్జునుడు గురువారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయన్ని ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. అర్జునుడు 43 ఏళ్లగా శాఖకు అందించిన సేవలను పలువురు కొనియాడారు.

బాస్కెట్‌బాల్‌లో క్రీడాకారుల ప్రతిభ



సెమీ ఫైనల్స్‌కు చేరుకున్న యానాం బాస్కెట్‌బాల్ జట్టు

యానాం: పుదుచ్చేరి స్టేట్ స్కూల్ గేమ్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా గురువారం జరిగిన బాస్కెట్‌బాల్ అండర్–19 పోటీల్లో యానాం బాలుర జట్టు ప్రతిభ కనబరిచిందని జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాము సత్యనారాయణ, పీఈటీ రమేష్ తెలిపారు. జోన్–5, 8 జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో యానాం జట్టు 31–47 స్కోరుతో గెలిచి, సెమీ ఫైనల్స్‌కు చేరకుందన్నారు. సెమీ ఫైనల్స్‌లో విజయం సాధిస్తే ఫైనల్స్‌కు వెళ్తుందన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి సాయం



భాస్కరరావు కుటుంబానికి సాయం అందిస్తున్న సంఘ సభ్యులు

అమలాపురం రూరల్: ఇందుపల్లికి చెందిన డాగురే సురక్ష యోజన ఫొటోగ్రాఫర్ల, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ సభ్యుడు మట్టపర్తి నాగ భాస్కరరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. డాగురే సురక్ష యోజన ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కార్యవర్గం, అమలాపురం అసోసియేషన్ పెద్దలతో కలసి భాస్కరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబానికి ట్రస్ట్ చైర్మన్ పోసిన వీరేంద్రకుమార్ రూ.48,400 చెక్కును అందించారు.

వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలతో వలంటీర్లు

ముమ్మిడివరం: గాడిలంక పంచాయతీ పరిధిలో గ్రామ వలంటీర్లు గురువారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. జగనన్నకు మద్దతుగా వారంతా రాజీనామా చేసి ఆ పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేశారు. తామంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామని తెలిపారు. సర్పంచ్ పెద్దిరెడ్డి మునీంద్రరావు, గ్రామ కమిటీ అధ్యక్షులు నగుబత్తుల రామకృష్ణారావు, వరసాల సత్యనారాయణ, గిరిగి సత్యసాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడి పింఛెన్..

- మండుటెండలో బ్యాంకుల వద్ద నిరీక్షణ
- పింఛను సొమ్ము తీసుకునేందుకు అవస్థలు
- చంద్రబాబు అండ్ కో కుట్రతో తిప్పలు

అమలాపురం టౌన్: ఒకటో తేదీనే వలంటీర్లు ఇంటి తలుపులు తట్టి మరీ పింఛన్ డబ్బులు చేతిలో పెట్టి వెళ్లే పరిస్థితి అవ్వా తాతలకు దూరమైంది. గత టీడీపీ హయాంలో పింఛనుదారులు చూసిన కష్టం మళ్లీ మొదలైంది.. అప్పట్లో గంటల తరబడి నిలబడి క్యూలో ఉంటేనే సొమ్ము చేతికి అందేది.. చంద్రబాబు అండ్ కో పన్నాగం, ఎన్నికల సంఘ ఆంక్షల కారణంగా వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ డబ్బులు ఇచ్చే పరిస్థితి లేకుండా పోయింది. అధిక శాతం వృద్ధులు మండుటెండలో బ్యాంకుల బాట పట్టి క్యూలో నిరీక్షించాల్సి వచ్చింది. అమలాపురం పట్టణంలోని పింఛనుదారులు స్థానికంగా పలు బ్యాంకులకు వెళ్లి గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ వ్యయ ప్రయాసలు పడి పింఛన్ డబ్బులు రూ.3 వేలు తీసుకుని నీరసంగా ఇంటి ముఖం పట్టారు. మంచానికే పరిమితమైన, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వృద్ధులకు ఇంటికి వెళ్లి పింఛన్ ఇచ్చినప్పటికీ, అధిక శాతం మందికి బ్యాంక్ ఖాతాల్లో డీబీటీ విధానం ద్వారా జమ అయ్యాయి. ఇలా అమలాపురం మున్సిపాలిటీలో 3,551 మంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్ల సొమ్ము పడింది. వీరంతా ఆటో బాడుగ కట్టించుకునో.. ఎవరినైనా బతిమాలి మోటారు సైకిల్ పైనో.. కాలి నడకనో బ్యాంక్‌లకు మండుటెండలో వెళ్లి డబ్బులు డ్రా చేసుకుని వచ్చారు. నేరుగా వెళ్లి 1,057 మందికి సచివాలయ సిబ్బంది పింఛన్లు అందించే ఏర్పాట్లు చేశారు. ఒకటో తేదీ రాగానే వలంటీర్ ఇంటికి తెచ్చి ఇచ్చే పింఛన్ డబ్బులు కోసం వృద్ధులు వేయికళ్లతో ఎదురు చూసేవారు. ఆ డబ్బులతో మందులు, వైద్యానికి చాలా వరకూ ఉపయోగపడేవి. ఎండల తీవ్రతకు భయపడి కొందరు వృద్ధులు బ్యాంకులకు వెళ్లి తీసుకునేందుకు సాహసించలేకపోయారు. తమకు బ్యాంక్‌లకు వెళ్లి తీసుకునే దుస్థితిని కల్పించిన చంద్రబాబును కొందరు లబ్ధిదారులు దుయ్యబట్టారు. వలంటీర్లు అందించే సేవలు కావాలని కోరారు.



అమలాపురంలోని ఓ బ్యాంక్‌లో పింఛన్ డబ్బు కోసం క్యూ కట్టిన వృద్ధులు

వలంటీర్ లేక అవస్థలు



ప్రతి నెలా ఒకటో తేదీనే మా వలంటీర్ ఇంటికి వచ్చి వేలి ముద్ర వేయించుకుని పింఛన్ డబ్బులు చేతిలో పెట్టేవాడు. రెండు నెలలుగా ఈ పరిస్థితి లేక చాలా ఇబ్బంది పడ్డాను. బ్యాంక్ ఖాతాలో పింఛన్ డబ్బులు వేయడంతో వ్యయ ప్రయాసలకోర్చి బ్యాంక్‌కు వెళ్లి డబ్బులు తీసుకున్నారు. ఇంకా వచ్చే నెలా కూడా ఇలాగే తీసుకోవాలంటే బాధగా ఉంది. వలంటీర్ల వ్యవస్థతో పింఛన్లే కాదు ఇతర లబ్ధిని కూడా అందుకుంటున్నాం.

–చిక్కాల నాగేశ్వరి, పింఛనుదారు, 19వ వార్డు, అమలాపురం

మాలాంటి వారికి ఇబ్బందే..



ప్రతి నెలా ఏ ఇబ్బంది లేకుండా ఇంటి వద్దే వలంటీర్ల ద్వారా తీసుకునే పింఛన్‌ను చంద్రబాబు పెట్టిన ఫిర్యాదు వల్ల బ్యాంక్‌లకు వెళ్లి తీసుకునే పరిస్థితి తప్పడం లేదు. వృద్ధులను ఇబ్బంది పెట్టేందుకే ఈ నిబంధన పెట్టారు. వలంటీర్ల సేవలను తాత్కాలికంగా దూరం చేయడం వల్ల నాలాంటి పింఛనుదారులు అవస్థలు పడుతున్నారు. ఎండలో చెమటలు కక్కుతూ బ్యాంక్‌కు వెళ్లి సొమ్ము తీసుకునేటప్పుడు చుక్కలు కనిపించాయి.

–వాకలపూడి రామారావు, పింఛనుదారు, 15వ వార్డు, అమలాపురం

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల తనిఖీ



కొంకపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద సీఐ క్రిస్టోఫర్‌కు సూచనలిస్తున్న పోలీస్ అబ్జర్వర్ చంద్రకాంత్

అమలాపురం టౌన్: పట్టణంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన స్థానిక కొంకాపల్లి మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఎస్‌కేబీఆర్ కళాశాల ప్రాంతాలను జిల్లా పోలీస్ అబ్జర్వర్ ఎంవీ చంద్రకాంత్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ రెండు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అదనపు బందోబస్తు ఏర్పాట్లపై పట్టణ సీఐ కె.కృస్టోఫర్‌తో చర్చించారు. అలాగే బీఎల్‌వోలు, వీఆర్వోల విధుల గురించి కూడా పలు సూచనలు చేశారు. పట్టణ ఎస్సైలు కిశోర్‌బాబు, చంటి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మేనిఫెస్టోతో మరింత భరోసా



రోళ్లపాలెంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

- మంత్రి పినిపే విశ్వరూప్
- మూడు గ్రామాల్లో ప్రచారం

అమలాపురం రూరల్: ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోతో పేద, మధ్యతరగతి వర్గాలకు మరింత సంక్షేమం దరిచేరుతుందని వైఎస్సార్ సీపీ అమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం ఇందుపల్లి, రోళ్లపాలెం, ఇమ్మిడివరప్పాడు గ్రామాల్లో పార్టీ నాయకులతో కలసి ఆయన పర్యటించారు. ఈ ప్రచారంలో వందలాది మంది నాయకులు, కార్యకర్తలులు, అభిమానులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రచార రథంపై నుంచి విశ్వరూప్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ప్రజలకు అభివాదం చేశారు. జగనన్న సీఎం అయితేనే పథకాలు తిరిగి అమలవుతాయని అన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీని గెలిపించాలని ఓట్లు అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన విశ్వరూప్‌కు మహిళలు హారతులు పట్టారు. రాజేశ్వరిదేవి, ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, సర్పంచ్ రేలంగి దుర్గారావు, సొసైటీ అధ్యక్షుడు జొన్నావిత్తుల అమర్‌నాథ్, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు కేతా భానుతేజ, గ్రామ కమిటీ అధ్యక్షులు కుడుపూడి నాగరాజు, ఉల్లంగి సత్తిబాబు, నాయకులు కుడుపూడి ప్రసాద్, గుత్తుల సత్యనారాయణ, చొల్లంగి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

అల్లవరం: రెల్లుగడ్డ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, జనసేన కార్యకర్త మోకా బాలయోగి మంత్రి పినిపే విశ్వరూప్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. అమలాపురంలోని మంత్రి నివాసంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ ఆధ్వర్యంలో బాలయోగికి పార్టీ కండువాను వేసి మంత్రి ఆహ్వానించారు. గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే జగన్‌కు తెలుసు

అమలాపురం టౌన్: కష్టాల్లో ఉన్న పేదలను ఆదుకోవడం జగన్‌కు తెలుసని, ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయడం ద్వారా మళ్లీ సంక్షేమ రాజ్యం సాధ్యమవుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పినిపే విశ్వరూప్ సతీమణి బేబీ మీనాక్షి, తనయుడు డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. విశ్వరూప్‌నకు మద్దతుగా స్థానిక 9వ వార్డులో సతీమణి బేబీ మీనాక్షి, 19వ వార్డులో కుమారుడు డాక్టర్ శ్రీకాంత్ ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా వార్డుల్లో ఉన్న అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలుల వేసి ఘన నివాళు లర్పించి, ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైస్ చైర్మన్లు తిక్కిరెడ్డి వెంకటేష్, వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్‌పర్సన్ దూడల వెంకట వీరీతాదేవి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కొల్లాటి దుర్గాబాయి, పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు దూడల ఫణి, నాయకులు వంటెద్దు వెంకన్న నాయుడు, కల్వకొలను ఉమ, మెండు రమేష్‌బాబు, చిక్కాల రవిశంకర్, చదలవాడ రాజారావు, ఊటాల వెంకటేష్ తదితరులు పాల్గొని ప్రచారం చేశారు.



అమలాపురం 9వ వార్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న మంత్రి విశ్వరూప్ సతీమణి బేబీ మీనాక్షి, నాయకులు



అమలాపురం 19వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ శ్రీకాంత్, నాయకులు



బాలయోగికి వైఎస్సార్ సీపీ కండువా వేసి ఆహ్వానిస్తున్న మంత్రి విశ్వరూప్

సంక్షేమ పాలనకు మళ్లీ పట్టం కట్టండి



పి.మల్లవరంలో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, పితాని బాలకృష్ణ తదితరులు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- పి.మల్లవరంలో జోరుగా ఎన్నికల ప్రచారం

తాళ్లరేవు: ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ఐదేళ్లపాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేసిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. గురువారం పి.మల్లవరం గ్రామ పంచాయతీలో ఆయన పార్టీ నేతలు పితాని బాలకృష్ణ, డీఎంఆర్ శేఖర్, దున్నా జనార్దనరావు, వుంగరాల లక్ష్మణరావులతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. అనంతరం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నను తిరిగి సీఎంగా చేసుకోవాల్సిన ఆవశ్యకత అందరిపైనా ఉందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్, పార్టీ మండల అధ్యక్షుడు కాద గోవిందకుమార్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు దడాల జగదీశ్వరరావు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు వెంటపల్లి వాసంతి, మండల యువజన విభాగం అధ్యక్షుడు మట్టపర్తి లోవరాజు, మండల సచివాలయాల కన్వీనర్ దున్నా శ్రీకాంత్, గ్రామ ఉప సర్పంచ్ పంపన రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు దున్నా రాంబాబు, నాయకులు కొపనాతి నాగరాజు, రేవు మల్లీశ్వరి, బొంతు మోహన్, మోకా మధుబాబు, వెంటపల్లి నూకరాజు, వీరనాగు, గంజా కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార గ్రామాల్లో..

నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ విజయం కోరుతూ ఆయన సతీమణి నీరజ, కుటుంబ సభ్యులు విస్తృత ప్రచారం చేశారు. పటవల పంచాయతీ కొత్తూరు, మట్లపాలెం తదితర గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తన భర్తను గెలిపించాలని నీరజ కోరారు. సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు, నాయకులు తణుకు సత్తిబాబు, కాపవరపు శ్రీదేవి, పోతుల రత్నకుమారి, వారా సూర్యకుమారి, అరదాడి దాసు, ఓలేటి సత్యనారాయణ, ఓలేటి సత్తిబాబు, పినపోతు ఆదినారాయణ, కర్రి రాజు, దున్నా రాజు, ఓలేటి జాంపండు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

కోరంగి పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం తదితర మత్స్యకార గ్రామాలకు చెందిన సుమారు 50 మంది యువత వైఎస్సార్ సీపీ నాయకుడు కొపనాతి నాగరాజు ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. పి.మల్లవరంలో ఎన్నికల ప్రచారం చేసిన ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ విజయానికి కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు.



పటవల పంచాయతీ కొత్తూరులో ఓట్లు అభ్యర్థిస్తున్న పొన్నాడ సతీమణి నీరజ



పి.మల్లవరంలో వైఎస్సార్ సీపీలో చేరిన మత్స్యకార యువకులు

ఐదేళ్లూ... ఆనందం

- 'నేతన్న నేస్తం'తో కార్మికులకు చేయూత
- రెండు నియోజకవర్గాల్లో 1,419 మందికి లబ్ధి
- మొత్తం రూ.49.42 కోట్ల సాయం

అమలాపురం రూరల్: అందమైన చీరలైనా.. జరీ పంచెలైనా.. ఇలా వస్త్రాల తయారీలో చేనేతలది అందెవేసిన చేయి. అలాంటి చేనేత రంగం టీడీపీ హయాంలో కుదేలైంది.. వైఎస్సార్ సీపీ వచ్చాక ఈ ఐదేళ్లు స్వర్ణయుగాన్ని చూసింది.. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ వృత్తిపై ఆధారపడిన కార్మిక కుటుంబాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆసరాగా నిలిచారు. 2019లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నేతన్న నేస్తం పథకం ద్వారా ఆదుకున్నారు. ఆధునికత, రెడీమేడ్ వస్త్రాలు మార్కెట్‌ను ముంచెత్తడంతో తరతరాలుగా నేత వృత్తిని నమ్ముకున్న కుటుంబాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. ఈ రంగానికి పునరుజ్జీవం కల్పించేందుకు సీఎం జగన్ ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకొచ్చింది. నేతన్న నేస్తం పథకం ద్వారా ఏటా ఒక్కో కుటుంబానికి రూ.24 వేల చొప్పున, ఈ ఐదేళ్లకు రూ.1.20 లక్షల ఆర్థిక సాయం అందించింది. ఇలా మొత్తం అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లో 1,419 మందికి రూ.49.42 కోట్లు జమ చేసింది. ఈ రెండు నియోజకవర్గాల్లో 8 చేనేత సహకార సంఘాల ద్వారా 1,800 మంది సభ్యులు ఉన్నారు. మాస్టర్ వీవర్స్ ద్వారా మగ్గాలపై వస్త్రాల తయారీ జరుగుతుంది. వీరిలో మగ్గాలు ఉన్న కార్మికులకు పెట్టుబడి సాయం అందిస్తున్నారు.



బండారులంకలో చేనేత వస్త్రాలు తయారు చేస్తున్న కార్మికురాలు

మండలాలు	నేతన్న నేస్తం లబ్ధిదారులు
అమలాపురం రూరల్	819
అల్లవరం	8
ఉప్పలగుప్తం	177
ముమ్మిడివరం నగర పంచాయతీ	44
ముమ్మిడివరం	80
కాట్రేనికోన	125
ఐ.పోలవరం	53
తాళ్లరేవు	113

కరోనా సమయంలోనూ సాయం



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి విడతగా 2019లో రూ.24 వేల సాయం అందించారు. అప్పటి నుంచి హామీ మేరకు ఐదు విడతలుగా అందజేస్తూనే ఉన్నారు. కరోనా కాలంలో ఆరు నెలలు ముందే సాయం జమ చేశారు. ఐదేళ్లు మొత్తం రూ.1.20 లక్షల సాయం అందింది. మళ్లీ మరో ఐదేళ్ల భరోసాగా నిలుస్తామని సీఎం జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించడం హర్షణీయం.

–కూర్మ వీరవేణి, చేనేత కార్మికురాలు, బండారులంక

ఇచ్చిన హామీ నెరవేర్చారు



ఏడాదికి రూ.24 వేల చొప్పున సాయం చేస్తానని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికులకు హామీ ఇచ్చారు. చెప్పిన మాట ప్రకారం ఐదేళ్లు క్రమం తప్పకుండా సొమ్ము జమ చేశారు. చేనేత చరిత్రలో ఇలాంటి సాయం ఏ ప్రభుత్వమూ చేయలేదు. సంక్షోభంలో ఉన్న చేనేత కార్మికులకు భరోసా కల్పించారు. మళ్లీ సాయం అందిస్తాననడం అభినందనీయం.

–చింతా ఉమామహేశ్వరరావు, చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు, బండారులంక

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



నడవపల్లి గండిగాని చెరువులో వైఎస్సార్ సీపీ కండువా వేసి ఆహ్వానిస్తున్న పితాని బాలకృష్ణ

కాట్రేనికోన: నడవపల్లి పంచాయతీ గండిగాని చెరువు గ్రామానికి చెందిన సుమారు 300 మంది జనసేన కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది. గండిగాని చెరువుకు చెందిన జనసేన కార్యకర్తలు మట్టపర్తి శంకరరావు, సంసాని రామకృష్ణ పరహంస, సంసాని సాయిబాబు, మట్టపర్తి అర్జునరావు, మట్టపర్తి సూర్యప్రకాశరావు, మట్టపర్తి విజయ, మట్టపర్తి సత్యనారాయణ, మట్టపర్తి ప్రసాద్, రవితో పాటు పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీ జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు సంసాని నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ సానబోయిన నాగేశ్వరరావు, సర్పంచ్ దొమ్మేటి పల్లవి వెంకటేశ్వరరావు, వనచర్ల వెంకటరమణ, చొల్లంగి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి శ్రీనివాసరావు, కొప్పిశెట్టి వెంకటరమణ, సత్యనారాయణ, కముజు మల్లేశ్వరరావు, పిల్లి గోపి తదితరులు ఉన్నారు.

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ పరిధి ఒకటో వార్డు రాజుపాలెం, 20వ వార్డు మట్టాడి పాలెంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ పార్టీలో చేరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ సమక్షంలో ఆయా గ్రామాలకు చెందిన సుమారు 150 మంది కాంగ్రెస్‌గుల త్రిమూర్తులు ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. వీరికి పితాని బాలకృష్ణ కండువాలు వేసి ఆహ్వానించారు.

పరుగు పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఐ.పోలవరం: జి.మూలపొలం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 8వ, 9 తరగతుల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పరుగు పోటీల్లో ప్రతిభ చాటారు. ఇటీవల మహారాష్ట్రలో ఎంపీఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఓలేటి రాజు (8వ తరగతి), మల్లాడి భాగ్యలక్ష్మి (9వ తరగతి) ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలను ఎంపికయ్యారు. వీరిని గురువారం హెచ్‌ఎం కె.జనార్దనరావు, ఉపాధ్యాయుడు ఆర్.వీరభద్రరావు, జిల్లా సెక్రటరీ, కోచ్ ఎం.సూర్యపాల్, డిస్ట్రిక్ట్ కోచ్ రాయపురెడ్డి, బాబి, గ్రామ పెద్దలు అభినందించారు. అలాగే వీరి విజయానికి కారకులైన డిస్ట్రిక్ట్ కోచ్ బాబికి కృతజ్ఞతలు తెలిపారు.



విద్యార్థులు ఓలేటి రాజు, మల్లాడి భాగ్యలక్ష్మిలతో హెచ్‌ఎం జనార్దనరావు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముమ్మిడివరం: స్థానిక 33/11 కేవీ సబ్ స్టేషన్ 11 ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎం.రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ తీగల మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా ఈ అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఓటరు చైతన్యంపై పుస్తకావిష్కరణ

అమలాపురం టౌన్: అమలాపురం లీడ్ ద లైవ్స్ సంస్థ స్థానిక యర్రమిల్లివారి వీధిలోని సంస్థ కార్యాలయంలో ఆన్‌లైన్‌లో ఓటర్లకు అవగాహన సదస్సు నిర్వహించింది. సంస్థ సీఈఓ చిక్కం సాంబశివరావు అధ్యక్షతన గురువారం ఈ సదస్సు జరిగింది. లీడ్ ద లైవ్స్ యాప్‌లో 195 మంది పాల్గొన్న ఈ కార్యక్రమంలో సాంబశివరావు రచించిన 'ఓటరు– ప్రజాస్వామ్యం పునాది– కర్త– క్రియ– కర్మ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఓటరు మనస్తత్వం ఎలా మారుతుందో, ఎటువంటి మార్పులకు గురవుతుందో, ఎలాంటి వ్యక్తులను ఎంచుకోవాలో వంటి వాటితో కవితల రూపంలో ఈ పుస్తకాన్ని రచించినట్లు సాంబశివరావు తెలిపారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి లీడ్ ద లైవ్స్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఈ పుస్తకాన్ని ఉచితంగా పొందవచ్చని సంస్థ కో ఆర్డినేటర్ శాంతి స్వరూప్ చెప్పారు.